నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 23 జనవరి 2025 | SURYAPET




భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత పక్కన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి

# కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్

## బీఆర్ఎస్ కార్యాలయాలు, ఇండ్లపైకి వస్తే సహించం

- ఇంకోసారి కన్నెత్తి చూసినా మా కార్యకర్తలు ఊరుకోరు
- మేం తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ తిరిగే పరిస్థితి ఉండదు
- మూసీ మురికికూపానికి కారకులు ఎవరు..?
- కేసీఆర్ హయాంలోనే మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవన సంకల్పం
- నాడు రూ. 78 వేల కోట్లతో ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమం
- దగ్గరలోనే కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే రోజులు
- మహిళా హామీలపై ఆడబిడ్డలు ఉద్యమించాలి
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

యాదాద్రి భువనగిరి, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : తమ పార్టీ కార్యాలయాలు, ఇండ్లపైకి వస్తామంటే భయపడే ప్రసక్తేలేదని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. 60లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ అని, అందరూ తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నాయకులారా, జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించారు. ఇంకోసారి బీఆర్ఎస్ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరని మండిపడ్డారు. భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాయలంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమది రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయంపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాదన్నారు. తమది మాటలు, విజ్ఞత, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసిన సంస్కృతి అని చెప్పారు.

### 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసింది?

మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలని కవిత సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే 60 ఏండ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మూసీ నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారని చెప్పారు. అందులో భాగంగానే 36 ఎస్టీపీలను ఏర్పాటు చేయడంతో పాటు గోదావరి నదితో మూసీని అనుసంధానించాలని భావించారని గుర్తు చేశారు. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పేరుతో ప్రజా ధనం లూటీ చేయాలని కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండలో కేసీఆర్ మొదలుపెట్టిన నీటిపారుదల శాఖ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయాలని చూస్తున్నారని, అది ఎవరి తరం కాదని అన్నారు.

### బీఆర్ఎస్ హయాంలో రూ. 78 వేల కోట్ల పనులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమకారుల ఖిలా అని కవిత అన్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, ఉమ్మడి జిల్లాలో మూడు కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మెడికల్ కళాశాల అయినా తీసుకొచ్చిందా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ అభివృద్ధి కోసం రూ. 36 వేల కోట్లు ఖర్చు చేశామని, రూ. 42వేల కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా వరి పంట సాగైందని, ఈ సారి ధాన్యం కొనుగోళ్లలో 10శాతం కూడా దాటలేదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. యాసంగిలో ఎస్సారెస్పీకి నీళ్లివ్వకుండా పంటలను ఎడబెట్టారని మండిపడ్డారు. సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారని, సంక్రాంతి కూడా పోయిందని కవిత దుయ్యబట్టారు.

### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మహిళలకు ఇచ్చిన ఏ హామీలను కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని, ఆడబిడ్డలు ఉద్యమం చేయాలని కోరారు. సంక్షేమ పథకాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గ్రామ సభల తర్వాత అర్హులకు నాలుగు పథకాలు అందకుంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్య గౌడ్, క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మేడె రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, బొల్ల శివశంకర్, కొలుపుల అమరేందర్, జనగాం పాండు, ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జేఈఈ మెయిన్స్ పరీక్షలు షురూ

రామగిరి, జనవరి 22: జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రం ఎస్పీఆర్ స్కూల్ ప్రాంగణంలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం షిఫ్ట్ -1లో 180 మందికి గానూ 174 మంది, మధ్యాహ్నం షిఫ్ట్-2లో 180 మంది 178 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

### 21 మంది స్పౌజ్ ఉపాధ్యాయుల రిలీవ్

రామగిరి : జీఓ 317తో పలు జిల్లాల నుంచి నల్లగొండకు వచ్చిన 22 మంది ఉపాధ్యాయులు తమను స్పౌజ్ కోటా కింద సొంత జిల్లాలకు బదిలీ చేయాలని గతంలో దరఖాస్తు చేసుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు బుధవారం డీఈఓ భిక్షపతి బదిలీపై వెళ్లడానికి సిద్ధంగా ఉన్న 21 మందిని రిలీవ్ చేశారు. దీనికి సంబంధించి ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఒకరు వెళ్లేందుకు ఇష్టపడక పోవడంతో రిలీవ్ చేయలేదు.

### ఎంజీయూ డిగ్రీ ఫలితాలు విడుదల

- ఫిబ్రవరి 3 వరకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు



డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, జనవరి 22: మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లోని 1,3,5 సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను బుధవారం యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 3 వరకు రీవాల్యుయేషన్‌కు అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి సబ్జెక్టుకు రూ.200 చొప్పున ఆయా కళాశాలల్లో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, అసిస్టెంట్ సీఓఈలు లక్ష్మీప్రభ, సంధ్యారాణి, ప్రవళిక, రామచంద్రం, కోఆర్డినేటర్ భిక్షమయ్య పాల్గొన్నారు.

# నిలదీతలు.. అడ్డగింతలు

## గ్రామ సభల్లో రెండో రోజూ అదే తీరు



కట్టంగూర్ : జాబితాలో తమ పేర్లు రాలేదని మునుకుంట్ల గ్రామసభలో అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై తీవ్ర అభ్యంతరాలు
- ఏ ప్రతిపాదిక ఎంపిక చేశారంటూ ప్రశ్నల వర్షం
- ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టాలని ఆగ్రహం
- తూతూమంత్రంగా గ్రామసభల ముగింపు
- గుడిపల్లిలో దొంగల రాజ్యమంటూ నినాదాల హోరు

నల్లగొండ ప్రతినిధి, జనవరి22(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితాల ఆమోదం కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రెండో రోజు బుధవారం కూడా తీవ్ర గందరగోళం.. నిరసనలు, అడ్డగింతలు.. ఆగ్రహాల మధ్యనే కొనసాగాయి. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపిక జాబితాలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా జాబితాలపై ప్రజలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ అధికారులను నిలదీశారు. అర్హులైన వారిని పక్కన పెట్టి అనర్హులకే పెద్దపీట వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో ఏడాది కిందట దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఇక పెట్టుకున్న దరఖాస్తుల ప్రకారం తమకు పథకాలు అందుతాయని ఇన్నాళ్లు ఎదురుచూస్తూ వచ్చారు. ఈ నెల 26 నుంచి పథకాలను అమలు చేస్తామంటూ అందుకు అర్హులైన లబ్ధిదారుల కోసం గ్రామ సభలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ గ్రామ సభల్లో ప్రదర్శిస్తున్న జాబితాల్లో వచ్చిన పేర్లకు గతంలో ప్రజాపాలన దరఖాస్తుల్లో చేసిన వారికి చాలా వరకు పొంతన లేకుండా ఉన్నాయి. దీంతో రెండు రోజుల నుంచి జరుగుతున్న గ్రామసభల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. అన్ని చోట్ల అధికారులపైకి ప్రజలు తిరగబడుతున్నారు. ఏవేమీ జాబితాలు? ఏ ప్రతిపాదికన ఎంపిక చేశారు? కొద్ది మందినే ఎంపిక చేయడంలో ఉద్దేశ్యం ఏంటని? ప్రజలు నిలదీస్తుండడంతో అధికారుల వద్ద సమాధానం కరువైంది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల్లో చాలా మంది అనర్హులకు చోటిచ్చి... అసలైన నిరుపేదలను పక్కన పెట్టారంటూ ఎక్కువ చోట్ల ఆందోళనలు కనిపించాయి. కొన్నిచోట్ల ఇదేమీ రాజ్యం... ఇదేమీ రాజ్యం... దోపిడీ రాజ్యం... దొంగల రాజ్యం అంటూ నినాదాలు హోరెత్తాయి. బుధవారం నల్లగొండ జిల్లాలోని గుడిపల్లి మండల కేంద్రంలో గ్రామసభలో రచ్చరచ్చ జరిగింది. అధికారులు చూపిన జాబితాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిడమనూర్‌లోనూ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకే ఎక్కువగా ఇచ్చారంటూ అధికారులపై తిరుబడ్డారు. దీంతో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు బయటకు వెళ్లిపోయారు. త్రిపురారం మండలం డొంకతండాలో రేషన్‌కార్డులు, ఇండ్ల జాబితాలో అర్హులే లేరంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నల్లగొండ మండలం అప్పాజిపేట, ఖాజీరామారంలోనూ జాబితాలపై ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలైన పేదలను పక్కన పెట్టి అర్హత లేని వారికే ఇచ్చారంటూ అధికారులను నిలదీశారు. కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామసభలో ప్రజలు జాబితాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు, ఇండ్లల్లో నిజమైన పేదల పేర్లు లేవని నిలదీశారు. చిట్యాల మండలం ఆరెగూడెంలో ప్రజలు జాబితాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడులో తప్పులతడకగా జాబితాలు రూపొందించారని, తక్షణమే వీటిని రద్దు చేసి నిజమైన లబ్ధిదారులకు పథకాలు ఇవ్వాలంటూ అధికారులతో వాదనకు దిగారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో బీఆర్ఎస్ నేతలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై అధికారులను నిలదీశారు. గట్టుప్పల్ మండలం తెరటుపల్లిలో రేషన్‌కార్డు, ఇండ్ల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నేతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామసభలోనూ ప్రజలు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఇంకా దాదాపు ఎక్కువ గ్రామాల్లో గతంలో దరకాస్తులు చేసిన వారికి లబ్ధిదారుల జాబితాల్లో చోటుదక్కక పోవడంతో ప్రజలు శాపనార్థాలు పెట్టడం కనిపించింది. ఇక జాబితాల్లో పేర్లు లేని వారంతా కొత్తగా దరఖాస్తులు పెట్టుకునేందుకు ఎగబడుతూ పలుచోట్ల కనిపించారు. అయితే కొన్నిచోట్ల అధికారులు కొత్త దరఖాస్తులకు పెద్దగా ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపించడం లేదు. తూతూమంత్రంగా తమ వెంట తెచ్చుకున్న జాబితాలను చదివి వినిపిస్తూ గ్రామసభలను మమా అనిపిస్తునట్లు కూడా తెలుస్తున్నది.



కోదాడ రూరల్ : రేషన్ కార్డు అర్హుల జాబితాలో తన పేరు లేదని విలపిస్తున్న కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన కూలీ కొమ్మగాని రజిత

### సూర్యాపేట జిల్లాలో..


సూర్యాపేట, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లా వ్యాప్తంగా 139 గ్రామ సభలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 35 వార్డుల్లో బుధవారం సభలు జరిగాయి. గ్రామ సభలు ప్రారంభమైన తరువాత అయితే ఒకటి రెండు మినహా దాదాపు అన్ని చోట్ల అధికారులను ప్రజలు నిలదీశారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, భూములు ఉన్న వారు, ఇతర ఆస్తులు ఉన్న వారికి ఇస్తున్నారని, ఇంత చేసి ప్రజలకు ఏదో చేస్తున్నట్లు ఏ ముఖం పెట్టుకొని గ్రామ సభలకు వస్తున్నారంటూ అధికారులను నిలదీశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 15, 22, 23వ వార్డుల్లో సభలో గందరగోళం జరిగింది. నేరేడుచర్ల, దిర్శించర్ల, రేపాల, దోరకుంట, శూన్యంపహాడ్, వేపలసింగారం, నక్కగూడెం, చింతలపాలెం, మంగళతండా, అమీనాబాద్, రేపాల, దిర్శించర్ల, శెట్టిగూడెం, సూర్యాపేట మండలం రత్నపురం, పెన్‌పహాడ్ మండలం మాచారం, అర్వపల్లి బొల్లంపల్లి, నాగారం మండలం ఫణిగిరి, హుజూర్‌నగర్ మండలం లింగగిరి, తుంగతుర్తి మండలం సూర్యతండా, గొట్టిపర్తిలతోపాటు చింతలపాలెం నక్కగూడెం తదితర అనేక గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవని సభలకు హాజరైన అధికారులను ప్రశ్నించారు.



ఆత్మకూర్(ఎస్) : పాత సూర్యాపేట గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



పాలకవీడు : శూన్యపహాడ్ నిర్వహించిన గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు



త్రిపురారం: డొంకతండాలో అధికారులతో వాదనకు దిగుతున్న ప్రజలు



హుజూర్‌నగర్ రూరల్ : లింగగిరి గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

# దాడులకు భయపడం.. ప్రభుత్వంపై పోరుకు వెరవం

- బీఆర్ఎస్ నేతల స్పష్టీకరణ
- 28న జరిగే కేటీఆర్ మహా ధర్నాను జయప్రదం చేయాలి : కంచర్ల
- హైకోర్టు అనుమతి కాంగ్రెస్‌కు చెంపపెట్టు : భగత్
- రేవంత్ పాలనలో ప్రశ్నించే వ్యక్తులపై దాడులు : దూదిమెట్ల
- దాడులతో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారు : రాజీవ్‌సాగర్
- పోలీసుల పహారా, నిర్బంధాల నడుమ గ్రామ సభలు : పల్లె రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, మేడే రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్

నీలగిరి, జనవరి22 : ప్రశ్నించే శక్తులపై దాడులు చేసి భయానక పరిస్థితులు సృష్టించాలని కాంగ్రెస్ నాయకులు కుటిల యత్నాలు చేస్తున్నారని, వారి దాడులకు భయపడేది లేదని.. ప్రభుత్వంపై పోరుకు వెరసేది లేదని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బుధవారం మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు, మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవి కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై దాడులు చేస్తూ, ఎదురు తిరిగిన వారిని జైల్లో వేస్తామని బెదిరింపులు చేస్తే భయపడేది లేదని, రెట్టింపు ఉత్సాహంతో ప్రజల సంక్షేమ కోసం పని చేస్తామని చెప్పారు.

### ఏడాదిలోనే కాంగ్రెస్‌పై తిరుగబడుతున్న జనం

#### మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అపవాదులను మూటకట్టుకుందని రవి కుమార్ అన్నారు. మంత్రులు, అధికారులు ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిలదీస్తున్నారని, పోలీసుల పహారా, నిర్బంధాలతో ప్రస్తుతం గ్రామసభలు నిర్వహించుకునే దుస్థితికి వచ్చిందని విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగుసార్లు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని, ఎవరికి కూడా ఏమీ ఇవ్వలేదని తెలిపారు. త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నందున గ్రామాల్లోకి వెళ్లే ముఖం లేక గ్రామసభల పేరుతో ప్రజలను మరోమారు మోసం చేసేందుకు వస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్రా సుధాకర్, సీనియర్ నాయకులు బక్కా పిచ్చయ్య, బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కనగల్ సింగిల్‌విండో చైర్మన్ వంగాల సహదేవ్‌రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, మాజీ ఎంపీపీ కరీంపాష, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మాజీ ఎంపీటీసీలు బడుపుల శంకర్, పొగాకు గట్టయ్య, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల లింగస్వామి, బొజ్జ వెంకన్న, కడారి కృష్ణయ్య, నాయకులు ఉట్కూరు సందీప్‌రెడ్డి, మెండు మణిపాల్‌రెడ్డి, వీరమల్ల భాస్కర్, బొమ్మరబోయిన నాగార్జున, ఎస్.వెంకన్న, రవి, శ్యాంసుందర్, షరీఫ్ పాల్గొన్నారు.

### కేటీఆర్ సభలకు ఉలికిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

బీఆర్ఎస్ అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతున్నదని, కేటీఆర్ సభలను చూసి ఉలికి పడుతున్నదని కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. 21న కేటీఆర్ రైతు మహాధార్నాను దుర్మార్గపు ఆలోచనలతో అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. కానీ వారి ప్రయత్నాలను తిప్పికొట్టేలా కోర్టు అనుమతి ఇచ్చిందన్నారు. 28న మహా ధార్నాకు అనుమతి ఇచ్చినందున జిల్లా ప్రజలు, రైతులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు, ఇచ్చిన హామీలు అమలు కోసం అంతా కదం తొక్కాలని పిలుపునిచ్చారు. రెండు రోజులుగా జిల్లాలో జరుగుతున్న గ్రామసభల్లో ప్రజలు అధికారులను ఎక్కడిక్కడ నిలదీస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా గ్రామ సభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని, కాంగ్రెస్ పాలనలో మాత్రం లబ్ధిదారులను ఎంపిక చేసి గ్రామసభలు తూతూ మంత్రంగా జరుపుతున్నారని విమర్శించారు.

### కాంగ్రెస్ అరాచకాలను ఎదిరించే కేటీఆర్‌కు బాసటగా నిలువాలి : మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న ఆరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఈ నెల 28న నల్లగొండ మహాధర్నాకు వస్తున్న కేటీఆర్‌కు బాసటగా నిలిచేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని భగత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు కేటీఆర్ సభలను అడ్డుకునేందుకు కుటిల యత్నాలు చేసినా న్యాయస్థానం వారికి చెంపపెట్టులా తీర్పు ఇచ్చిందని తెలిపారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను కేటీఆర్ ప్రజలకు వివరిస్తున్నారనే అక్కసుతో అక్రమ కేసులు, దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజల హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తిస్తున్నారని తెలిపారు.

### కాంగ్రెస్ పాలనలో పెరుగుతున్న దాడులు : మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాట్లాడితే దాడి, ప్రశ్నిస్తే కేసు, ఎదురు తిరిగితే జైల్లో పెడుతున్నారని బాలరాజు అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే తత్వాన్ని హరించి వేస్తున్నారని, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. రేవంత్ పాలనలో ప్రతి జిల్లాలో ప్రజల ఆర్తనాదాలు మొదలైనాయన్నారు. పదేండ్లు పాలించిన కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తే రేవంత్‌రెడ్డి ఉన్న పథకాలకు మంగళం పాడుతున్నారని ఎద్దేవా చేశారు.

### మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం : మాజీ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్

దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై దాడి చేయడం అత్యంత అమానుషమని రాజీవ్‌సాగర్ అన్నారు. మహాధర్నా ఫ్లెక్సీలు తొలగించారని మున్సిపల్ కమిషనర్‌ను అడగడానికి వెళ్తే పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ గూండాలు భూపాల్‌రెడ్డిపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి సంఘటనపై డీజీపీ, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వీరిపై ఆర్టికల్ 92 ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రశ్నించే వారిపై దాడులు చేస్తూ భయంకర వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డి, గువ్వల బాలరాజు ఇండ్లపై, భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై, ఖమ్మంలో మాజీ మంత్రులపై దాడుల చేశారని తెలిపారు.

# బీఆర్ఎస్ రైతు ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- నల్లగొండలో ఈ నెల 28న నిర్వహించేందుకు అనుమతి
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్
- మహాధర్నా ఏర్పాట్లపై పార్టీ నేతల దృష్టి

నల్లగొండ ప్రతినిధి, జనవరి22(నమస్తే తెలంగాణ) : నల్లగొండ క్లాక్‌టవర్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ రైతు మహాధర్నాకు ప్రభుత్వం సిద్ధమైతే ప్రభుత్వం అడ్డుపడగా హైకోర్టు మాత్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలుత ఈ నెల 21వ తేదీన రైతు మహాధర్నా కోసం అనుమతి కోరితే... పోలీసు యంత్రాంగంపై ప్రభుత్వ పెద్దలు తీవ్ర ఒత్తిడి తెచ్చి అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. మర్నాడు ధర్నా అనగా 20వ తేదీన అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేయడంతో వెంటనే అలర్ట్ అయిన బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ధర్నాకు అనుమతి కోసం పోలీసులకు లేఖ ఇచ్చిన బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ పేరుతో పార్టీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేయగా బుధవారం హైకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ నెల 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాధర్నా నిర్వహించుకోవచ్చని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నేతలు మహాధర్నా ఏర్పాట్లపై దృష్టి సారించారు. అదే క్లాక్‌టవర్ వేదికగానే మహాధర్నాను నిర్వహించేందుకు, భారీగా రైతులు తరలివచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలు నిర్ణయించారు. వాస్తవంగా మహాధర్నాను ఈ నెల 21న నిర్వహణ కోసం నాలుగు రోజుల ముందుగానే నల్లగొండ డీఎస్పీకి బీఆర్ఎస్ నేత దేవేందర్ అనుమతి కోసం లేఖ అందించారు. 18న ఇదే విషయమై పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతలు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కూడా కలిశారు. పోలీసులు కూడా సానుకూలంగా స్పందించడంతో పార్టీ నేతలు మహాధర్నా ఏర్పాట్లపై దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా రైతులు తరలివచ్చేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. నల్లగొండలో సైతం ధర్నా ఫ్లెక్సీలను, హోర్డింగ్స్, కటౌట్లను ఏర్పాటు చేశారు. వాహనాలు, మైక్ సిస్టం, తాగునీరు, ఇతర సదుపాయాలన్నీ దాదాపు పూర్తి చేశారు. ఇవన్నీ ఇలా ఉండగా ధర్నాకు ఒక రోజు ముందు ఈ నెల 20న సడెన్‌గా పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించడంతో బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. అప్పటికప్పుడు హైకోర్టును ఆశ్రయిస్తూ ధర్నాకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ నెల 27 వరకు తాము గ్రామసభలు, రిపబ్లిక్ డే వేడుకల నేపథ్యంలో బందోబస్తు ఇవ్వలేమని ప్రభుత్వ ప్లీడర్ కోర్టుకు తెలపడంతో హైకోర్టు ఈ నెల 28న ధర్నాకు అనుమతించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టులా మారగా... బీఆర్ఎస్ నేతలు రెట్టించిన ఉత్సాహంతో రైతు మహాధర్నాకు సిద్ధమవుతుండడం విశేషం.